అనధికార ప్రతినిధులు!

- కూటమిపాలనలో యథేచ్ఛగా ప్రొటోకాల్ ఉల్లంఘన
- ప్రజా ప్రతినిధులకు విలువివ్వని అధికారులు, టీడీపీ నాయకులు
- ప్రభుత్వ కార్యక్రమాలకు అందని ఆహ్వానాలు
- అంతా వారిదే పెత్తనం
- పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్న ఉన్నతాధికారులు


గోనెగండ్లలో ప్రజాప్రతినిధులు లేకుండా నిర్వహించిన కందుల కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవ సమావేశం (ఫైల్)

గోనెగండ్ల: కూటమి సర్కార్ పాలనలో ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతోంది. ప్రజల చేత ఎన్నికైన ప్రజా ప్రతినిధులను డమ్మీలుగా మార్చేస్తున్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు మెజారిటీ సంఖ్యలో ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ నాయకుల పెత్తనం సాగుతోంది. వారే అనధికార ప్రజాప్రతినిధులుగా చలామణి అవుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానాలు పంపకుండా అవమానిస్తున్నారు. అధికారులపై కూడా పెత్తనం చలాయిస్తున్నారు.

అంతటా వారిదే పెత్తనం

గోనెగండ్ల మండలంలో 21 ఎంపీటీసీ స్థానాలుండగా 20 మంది వైఎస్సార్‌సీపీకి చెందిన వారే గెలుపొందారు. అలాగే 20 గ్రామ పంచాయతీలకుగాను 16 చోట్ల వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే సర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. అయితే ఎక్కడికక్కడ తెలుగుదేశం పార్టీ నాయకులే అనధికార ప్రజా ప్రతినిధులుగా చలామణి అవుతున్నారు. పాలనా వ్యవహారాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారు. అధికారులపై కర్ర పెత్తనం చేస్తున్నారు. తాము చెప్పినట్టే వినాలని, నడుచుకోవాలని అందుకు భిన్నంగా వ్యవహరిస్తే అధికారులను దూషణలు, వేధింపులు, ఒత్తిళ్లతో మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించడం, భౌతిక దాడులకు పాల్పడడం, దౌర్జన్యాలకు దిగడం చేస్తున్నారు.

విస్తుపోతున్న జనం..

మునుపెన్నడూ లేనివిధంగా కూటమిపాలన సాగుతుండడం చూసి జనం విస్తుపోతున్నారు. తాము ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించిన వారిని కాదని ఎవరో అనామకులు, నేర చరిత కలిగిన వాళ్లు అధికార పార్టీ నాయకులం అన్న ముద్ర వేసుకుని అంతా తామై వ్యవహరిస్తుండడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లు భావిస్తున్నారు. తమను నమ్మి ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు సేవ చేసే అవకాశం ప్రస్తుత కూటమి పాలనలో లేకుండా పోవడంపై వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాలకు వెళ్లడమే మానుకున్నాం



కూటమి ప్రభుత్వంలో అధికారుల తీరు నచ్చక ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లడమే మానుకున్నాం. ప్రొటోకాల్ అసలు పాటించడంలేదు. గ్రామ సభలు, రెవెన్యూ సదస్సులకు ఆహ్వానం ఉండదు. పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికలో మా పాత్ర శూన్యంగా మరింది. కేవలం కూటమి నాయకులు ఇచ్చిన జాబితానే తుది జాబితాగా ప్రకటించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. – టీ. రమణి కుమారి, ఎంపీటీసీ(వైస్ ఎంపీపీ), గోనెగండ్ల

సర్పంచులను భాగస్వాములు చేయడం లేదు



ప్రభుత్వ పథకాలలో, కార్యక్రమాలలో సర్పంచులను భాగస్వాములు చేయడం లేదు. కూటమి ప్రభుత్వంలో సర్పంచులు కేవలం వీఎల్‌సీలు ఇవ్వడానికి మాత్రం పరిమితం అయిపోయాం. గృహ నిర్మాణం, మినీ గోకులం షెడ్ల లబ్ధిదారుల ఎంపికలో మాకు సంబంధం లేనట్లు అధికారులు వ్యవహరిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం ఇస్తున్నారు. పథకాల విషయంలో ప్రజలకు సమాధానం చెప్పలేకున్నాం. నిధులను పోగొట్టుకొనలేక వీఎల్‌సీలు ఇస్తున్నాం.
– రంగారెడ్డి, సర్పంచ్ బి. అగ్రహారం గ్రామం

బ్యూటీషియన్ కోర్స్‌లో శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పొదుపు గ్రూపు సభ్యులైన యువతులు, మహిళలకు బ్యూటీషియన్ కోర్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మంగళవారం తెలిపారు. ఔత్సాహికులైన వారికి పట్టణంలోని ఆర్వీ ఆసుపత్రి వెనుక గల భవనంలోని మూడవ అంతస్తులో బ్యూటీషియన్ కోర్స్‌లో శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు.

ఆసక్తి వున్న వారు ఆధార్‌కార్డ్, బ్యాంక్ పాస్ బుక్, పాన్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, పొదుపు గ్రూప్ కోడ్‌ల జిరాక్స్‌లతో స్థానిక పాత మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు మెప్మా సీఎంఎం జయవర్ధన్ సెల్.79016 10388, సీఓ రియాజ్‌బాషా 79016 10353, డీఈఓ ప్రదీప్ 79016 10384, కోర్స్ ట్రైనర్ మహమ్మద్ హుసేన్‌బాషా 91823 77339 నంబర్లను సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్ధ్య పనుల్లో కార్మికులు నిర్లక్ష్యం వహించవద్దని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్, పార్క్ రోడ్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పట్టణంలో ఎక్కడ కూడా అపరిశుభ్రత కనిపించకూడదని, ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

ఇష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ సుదర్శన్‌రెడ్డి

నందవరం : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివితే పదిలో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని ఎంఈఓ సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై సలహాలు, సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక తరగతులతో విద్య బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శివరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత అందరి బాధ్యత


జేసీబీతో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

నందవరం : పరిసరాల శుభ్రత అందరి బాధ్యతయని ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివప్పగౌడ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామంలోని డ్రైనేజీలు, నీటి కుంటలు, రోడ్లకు ఇరువైపుల కంప చెట్ల తొలగింపు వంటి పనులు చేపట్టారు. ఈ పనులను గ్రామ ఉప సర్పంచ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పరిశీలించారు. కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ నాయకులు చాంద్‌తాత పాల్గొన్నారు.

వైన్‌షాపును తొలగించాలి


సంతకాల సేకరణ చేపడుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

ఆదోని రూరల్: పట్టణంలోని కొత్త బస్టాండు రోడ్డు వద్ద సుంకులమ్మ దేవాలయం పక్కన కొత్తగా ఏర్పాటు చేసిన న్యూదీప్తి వైన్ షాపును తొలగించాలని మంగళవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ సీఐకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ నాయకులు సంతకాల సేకరణ చేపట్టారు. డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు వీరేష్, వెంకటేష్, మోహన్, జమీర్, సూరి, సురేష్, రవి, రాజు మాట్లాడుతూ.. వైన్ షాపును దేవాలయం, మసీదు, స్కూలుకు దగ్గరలో ఏర్పాటు చేయడంతో కాలనీవాసులు, భక్తులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే వైన్ షాపును అక్కడి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి


టీబీపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

ఆదోని టౌన్: ప్రజలు టీబీ పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు షేకున్‌బాను, అనిల్‌సాగర్, మహేష్‌బాబు, షైనాజ్‌బేగం సూచించారు. మంగళవారం ఆదోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని ఇందిరానగర్, హవన్నపేట మాక్ సెంటర్‌లో సచివాలయ ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ప్రజలకు టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, దగ్గులో రక్తపుచారలు పడటం, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉంటే తప్పనిసరిగా ఉదయం గల్ల తీసి పరీక్షకై ఆసుపత్రికి తీసుకొని రావాలన్నారు. టీబీ నమోదైన వారికి ఆరు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది బాబురాజు, అరుణ, జ్ఞానేశ్వరి, లలితమ్మ, ప్రజలు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి రోటరీక్లబ్ చేయూత


పట్టణంలో మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

ఎమ్మిగనూరుటౌన్: మహిళాభ్యున్నతికి రోటరీ క్లబ్ చేయూతనందిస్తుందని ఎమ్మిగనూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు నటరాజ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు తెలిపారు. స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బీజీఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ బాలకోటిరెడ్డి సహకారంతో మంగళవారం పట్టణంలో కస్తూరి ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో పద్మనాభరెడ్డి, కేఆర్ నరసింహారెడ్డి తదితరులతో కలిసి వారు పది మంది మహిళలకు కుట్టుమిషన్లను అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు ఎంసీ శివకుమార్, కేశవరెడ్డి, బజారిరెడ్డి, బైలుప్పుల షఫీవుల్లా, కె.బీరప్ప పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు


నందవరంలో రైతుల అర్జీలను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్

నందవరం : ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహించవద్దని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ ఆదేశించారు. రైతుల అర్జీల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు, రైతుల అర్జీలను పరిశీలించారు. సమస్యలను త్వరగా పరిష్కారించాలని తహసీల్దార్ శ్రీనివాసులును ఆదేశించారు.

సమస్యను పరిష్కరించండి..మహాప్రభో..!

తన సమస్యను పరిష్కరించండి మహాప్రభో.. అంటూ ఒక రైతు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ కాళ్లపై పడి వేడుకున్నాడు. మండల కేంద్రానికి చెందిన జిమ్మకల గణేష్ సబ్ కలెక్టర్ కాళ్ల పట్టుకుని తమ భూ సమస్యను పరిష్కరించాలని కన్నీటి పర్యంతమై వేడుకున్నాడు. తమ సమస్యను తహసీల్దార్ శ్రీనివాసులుకు విన్నవించి 6 నెలలైనా పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. సబ్ కలెక్టర్ వెంటనే అర్జీలను పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. సమస్యలుంటే దానిపై రైతుకు నివేదిక ఇవ్వాలని, ఆ నివేదికతో రైతు కోర్టుకు వెళ్లి సమస్యను పరిష్కరించుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో సర్వే డీటీ మహేష్, డిప్యూటీ తహసీల్దార్ శశిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం బ్యానర్లను తొలగించాలి

ఆదోని టౌన్: పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన మద్యం విక్రయ దుకాణం బ్యానర్లు, పోస్టర్లను వెంటనే తొలగించాలని కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సాయినాథ్, మాజీ కౌన్సిలర్ దిలీప్‌దోక డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేయాలని ఎక్కడ పడితే అక్కడ పోస్టర్లు వేయడం మంచిది కాదన్నారు. విద్యాసంస్థల బ్యానర్ పోస్టర్లను చూశాం, పసిపిల్లల నుంచి వృద్ధుల వరకు సేవించే పాల పదార్థాల కొనుగోలు కోసం వేసే బ్యానర్లను చూశాం, ఇంకా ప్రాణాలను కాపాడే ఆసుపత్రుల పోస్టర్లను చూశామని, ఇలా మద్యం కొనాలని రోడ్ల పక్కన బ్యానర్లను వేయడం మన ఆదోనిలోనే చూడడం సిగ్గుగా అనిపిస్తోందన్నారు. మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో వేసిన బ్యానర్లను తక్షణమే తొలగించి, చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మారుతీరావు, పార్టీ సీనియర్ నాయకుడు రామకృష్ణారెడ్డి, విద్యార్థి సంఘం నాయకుడు శ్రీనిత్ తదితరులు పాల్గొన్నారు.

బోధన మెరుగుపరుచుకోవాలి


మాట్లాడుతున్న సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు

గోనెగండ్ల : పూర్వ ప్రాథమిక విద్యా బోధనను మెరుగుపరుచుకోవాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు అంగన్‌వాడీ వర్కర్లకు సూచించారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో స్థానిక ఏపీ మోడల్ స్కూల్ నందు మంగళవారం అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ శ్రీనివాసులు పరిశీలించి మాట్లాడారు. సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 18 నుంచి 25వ తేదీ వరకు అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామాంజినేయులు, నీలకంఠ, ఆ పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్, సీఆర్పీలు పుల్లన్న, షఫీ ఉల్లా, గోవర్దన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పిల్లల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి

నందవరం : చిన్న పిల్లల విద్య, పోషణతో పాటు సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఎంఈఓ సుదర్శన్ రెడ్డి, డీఆర్పీ సుధావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి 120 డేస్ కార్యక్రమంలో భాగంగా కేఆర్పీలు, డీఆర్పీలు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కేఆర్పీ సుచరిత, డీఆర్పీలు గురుశేఖరమ్మ, సురేఖ, ఉరుకుందు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్యను అందించాలి

ఆదోని సెంట్రల్: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలని సీడీపీఓ ఉమామహేశ్వరి తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై పట్టణంలోని నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాలలో ఎంఈఓలు రాజేంద్ర ప్రసాద్, శ్రీనివాసుల పర్యవేక్షణలో శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు మల్లికార్జున, అలిమ్ సిద్దిఖీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంగ్ల భాషా దినోత్సవం


ఆంగ్ల ఉపాధ్యాయులు అబిదా బేగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆదోని సెంట్రల్: పట్టణంలోని ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమేష్ నాయుడు అధ్యక్షతన ఆంగ్ల భాష దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆంగ్ల భాష నైపుణ్యాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన నూర్ భాషా మాట్లాడుతూ.. ప్రైమరీ స్థాయి నుంచి ఆంగ్లభాషపై పట్టు సాధించాలన్నారు. అనంతరం ఆంగ్ల భాష ఉపాధ్యాయురాలు అబిదా బేగంను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇందిరా ప్రియంకా, ప్రమీలమ్మ, మధుసూదన్ రావు, రామకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గంగాధర్

గోనెగండ్ల : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తులకు వ్యక్తి గత వివరాలు తెలిపి మోసపోవద్దని సీఐ గంగాధర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేను సైబర్ మార్క్ అనే కార్యక్రమం నిర్వహించి, పోస్టర్లను విడుదల చేశారు. సీఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్ల వలలో పడి నష్టపోతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుందన్నారు. కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తి గత వివరాలను అపరిచిత వ్యక్తులతో పంచుకోవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాలు వలన బాధించబడితే వెంటనే 1930 సైబర్ టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని అర్బన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు, వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ అన్నారు. మంగళవారం పట్టణంలో సైబర్ సేఫ్టీ అవేర్‌నెస్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఆదోని కెనరా బ్యాంకు సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

21న జాబ్‌మేళా

ఆదోని రూరల్: పట్టణంలోని నాక్ శిక్షణా కేంద్రం ఎంపీయూపీ స్కూల్‌లో ఈనెల 21వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎల్.ఆనంద్‌రాజ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో హ్యుండాయ్ మోబిస్, నవభారత్ ఫర్టిలైజర్స్, ఎల్ఎల్‌పీ, కేవీఎంఎల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియెట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంబీఏ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ.12 వేల నుంచి రూ.18 వేల వరకు వేతనం అందుతుందన్నారు. మరిన్ని వివరాలకు 91774 13642 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

మిరపకు రూ.50వేలు ధర కల్పించాలి

కౌతాళం: రైతులు ఎంతో కష్టపడి పండించిన మిరప పంటకు ధరలేక, దిగుబడి రాక రైతులు అల్లడిపోతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని క్వింటాలకు రూ.50వేలు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డికి అందజేశారు. మాట్లాడుతూ మండలంలో 9వేల ఎకరాల వరకు మిరప పంటను సాగుచేశారని, ఎకరాకు 1.50లక్షల నుంచి రూ. 2లక్షల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. ఎకరాకు 3నుంచి 4క్వింటళ్ల పంట మాత్రమే రాగా, ధర కూడా రూ.10వేల నుంచి రూ.12వేల వరకు మాత్రమే ఉండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి ఈరన్న, సంఘం నాయకులు ఉలిగయ్య, హనుమంతు, వీరేష్, రామలింగ, మాబాషా పాల్గొన్నారు.

ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడుల నిర్ణయం తగదు

ఎమ్మిగనూరుటౌన్: ఎల్ఐసీలో వంద శాతం విదేశీ పెట్టుబడులు పెట్టే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకుడు రాముడు, ఎల్ఐసీ ఏజెంట్ల సంఘ నాయకులు తిమ్మప్ప, రామాచారి, ఉరుకుందప్ప, వీరేష్, బాషా డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎల్ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఎదుట ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కోట్లాది మంది ప్రజలు, ఉద్యోగులు, కార్మికులతో లాభాలతో నడుస్తున్న ఎల్ఐసీ సంస్థలోకి విదేశీ పెట్టుబడులు ఆహ్వానించడం తగదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బాషా, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

కదులుతున్న రైలులో ఎక్కొద్దు


ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌పీఎఫ్ ఏఎస్ఐ రాజేంద్రప్రసాద్

ఆదోనిటౌన్: మనిషి ప్రాణం విలువైనదని, కదులుతున్న రైలులో ఎక్కొద్దని ఆదోని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) ఏఎస్ఐ ఎస్.రాజేంద్రప్రసాద్, వీరేష్ అన్నారు. మంగళవారం ఆదోని రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులకు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. రైలులో ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. చుట్టూ పక్కల ఉన్న అపరిచితులతో అనుకూలంగా ఉండకూడదన్నారు. మహిళలు తమ తమ ఆభరణాలను బయటకు కనిపించేలా ఉంచకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, ఎక్స్ ఆర్మీ పోలీసు వీరశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్ విద్య కీలకం

ఎమ్మిగనూరుటౌన్: ఇంటర్మీడియెట్ విద్యనే విద్యార్థుల జీవితానికి కీలక మలుపు అని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గతంలో తాను ఇదే కళాశాలలో కాంట్రాక్ట్ కెమిస్ట్రీ అధ్యాపకుడిగా పనిచేశానని గుర్తు చేసుకున్నారు. తరగతి గదిలో అధ్యాపకుడిగా మారి విద్యార్థులకు పాఠం చెప్పారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కళాశాలలో స్టడీ, డైనింగ్ హాల్ నిర్మాణానికి తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయరాణి,అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎద్దుల బలప్రదర్శన పోటీలు ప్రారంభం


ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి

గోనెగండ్ల: మండలంలోని ఒంటెడుదిన్నె గ్రామంలో మౌలాలి మిన్నల్లా దస్తగిరి స్వాముల ఉరుసు మహోత్సవం సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో గ్రామ శివారులో రాష్ట్రస్థాయి ఒంగోలు ఎద్దుల బలప్రదర్శన పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. పోటీలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కేవీ కృష్ణారెడ్డి, ఎమ్మిగనూరు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ప్రారంభించారు. పోటీలకు 30 జతల ఎద్దులు హాజరయ్యాయి. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉండేదన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికై మాజీ సీఎం ఎంతో కృషి చేశారని చెప్పారు. అలాగే పెట్టుబడి సాయం కింద రైతు భరోసా పథకంతో రూ.13,500 నగదును రైతుల ఖాతాకే జమచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎస్‌బీ మన్సూర్, సర్పంచ్ కేశవ రెడ్డి, రాజామోహన్ రెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, శ్రీరామ్ రెడ్డి, నాగార్జున రెడ్డి, నరేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

బంగారు అభరణాలు ఇళ్లలో ఉంచుకోవద్దు


టౌన్ సీఐ వి. శ్రీనివాసులు

ఎమ్మిగనూరురూరల్: ఇళ్లలో విలువైన బంగారు ఆభరణాలు, నగదును ఉంచుకోవద్దని పట్టణ సీఐ వి. శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బంగారు ఆభరణాలు, నగదును బ్యాంక్ లాకర్లలో ఉంచుకోవాలని చెప్పారు. ఊర్లకు, పెళ్లిళ్లు, విహారయాత్రలకు, ఇతర పనులపై వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఇళ్లకు తాళాలు వేసి ఉండటం చూసి దొంగలు చోరీకి యత్నించే అవకాశాలు ఉన్నాయన్నారు. కొత్త వారు కాలనీలో సంచరిస్తున్నట్లు అనిపించినా, అనుమానం వచ్చినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రాత్రి 10 గంటల తరువాత అనవసరంగా బయటకనిపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అసాంఘిక కార్యాకలాపాలు జరిగుతున్నా, ఇతర మోసాలు మీ దృష్టికి వస్తే సెల్ 91211 01045 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

వైటీపీఎల్ విజేత యశోద లెవెన్ జట్టు


విజేత జట్టుకు రూ.50వేల బహుమతి అందిస్తున్న సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైడబ్ల్యూసీఎస్ మైదానంలో నిర్వహించిన ఎమ్మిగనూరు టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ (వైటీపీఎల్) క్రికెట్ పోటీల్లో స్థానిక యశోద లెవెన్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా మహేంద్ర జట్టు, మూడవ స్థానాన్ని జాలి యంగ్‌స్టార్ జట్టు దక్కించుకుంది. ఆయా జట్లకు మంగళవారం వరుసగా మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.50వేలు, రూ.30వేలు, రూ.20వేల నగదును సినీ నిర్మాత అగ్రహారం నాగిరెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే తాలూకా అధ్యక్షుడు శ్రీనివాసనాయుడు, మాజీ కౌన్సిలర్ రంగస్వామిగౌడ్, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ దోమభీమేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతరలో సందడే..సందడి


కోసిగిలో ఎద్దుల గిరక పోటీలు


చిన్నారులను ఆకట్టుకునే రంగుల రాట్నం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో రేణుక ఎల్లమ్మ జాతరలో రెండవ రోజున భక్తులతో సందడి నెలకొంది. మంగళవారం వేలాది మంది భక్తులు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వేలకొద్ది మంది తరలి వచ్చి అమ్మవారికి కుడుములు, గుగ్గిళ్లు, ఉప్పు మొక్కుబడిగా సమర్పించారు. ఆలయ అర్చకులు గౌరీష్ గౌడ, మూర్తి గౌడ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనార్థం కల్పించారు. జాతరలో గాజులు, మిఠాయి అంగళ్లు, చిన్నారుల బొమ్మలు , రంగుల రాట్నలతో భక్తులు రద్దీగా మారింది. భక్తులకు జాతరలో కాల్చి కడ్డీ మాంసం ప్రత్యేకం. కిలో రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయిస్తున్నారు.

ఆకట్టుకున్న ఎద్దుల గిరక పోటీలు

ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని కోసిగిలోని భూగేని చెరువు ప్రాంతంలో ఎద్దుల గిరక పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి రైతులతో కోసిగికు చేరుకుని గిరక పోటీలలో పాల్గొన్నారు.



గాజులు, మిఠాయి దుకాణాలు